క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రొద్దుటూరు : సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం పేదలకు అమృతానగర్‌లో స్థలాలు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికీ కొన్ని చోట్ల మౌలిక వసతులు కల్పించలేదన్నారు. పేదల స్థలాలను కబ్జా చేసి కొంత మంది అమ్ముకుంటున్నారని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

మైదుకూరు : మైదుకూరులోని మహాత్మాగాంధీ నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న నిరాశ్రయులకు శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. బి.కొత్తపల్లె గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గోసుల విజయ రాఘవరెడ్డి ఆర్థిక సాయంతో ఆయన కుటుంబ సభ్యులు దుప్పట్లను అందించారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు తీసుకెళ్లవచ్చని వైద్యాధికారి కోరారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండరాదు

ఖాజీపేట : ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా సిబ్బంది పనిచేయాలని తహసీల్దార్ ఉదయభారతి సిబ్బందికి సూచించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆమెను తిరుపతికి బదిలీ చేశారు. ఈసందర్భంగా ఆమెకు రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆర్ఐ రవితోపాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రేపు యాదవుల ఆత్మీయ మహాసభ

ప్రొద్దుటూరు కల్చరల్ : కడప నగరం తిరుపతి బైపాస్ రోడ్డులోని డీఎస్ఆర్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యాదవుల ఆత్మీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, కడప మేయర్ సురేష్ బాబు, ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, యాదవులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


'పల్లెకుపోదాం' విజయవంతం చేయాలి

చాపాడు : త్వరలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పల్లెకుపోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ యాదవ్ అన్నారు. మండలంలోని అల్లాడుపల్లెలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు ప్రతి గ్రామంలోకి వెళ్లి ప్రజల సమస్యలు తెసుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు ఉత్సాహం ఉండాలని, ప్రతి నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సుబ్బరాయుడు, మండల అధ్యక్షులు బొగ్గుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రేరణా శిక్షణ తరగతులు

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని ఇంటిగ్రేడ్ హాస్టల్‌లో బద్వేల్ డివిజన్ పరిధిలోని వసతి గృహాలలో 10వతర తి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఒక్కరోజు ప్రేరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. వసతి గృహాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు వసతితో పాటు మంచి భోజనం, అందుకు తగిన విధంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం డీడీ సరస్వతి మాట్లాడుతూ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘం సభ్యుడు వెంకటయ్య, బి.మఠంలోని వార్డెన్లు బాలుడు, మునెయ్య, ఆర్.నరసింహరెడ్డి, వెంకటేశ్వరమ్మ, విజయమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న అతన్ని 108 అంబులెన్స్ సిబ్బంది జనవరి 23న జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలోని జీఈ వార్డులో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించి శుక్రవారం అతడు మృతి చెందాడు. అతని పేరు రఫీ, 63 ఏళ్లు అని మాత్రమే ఐపీ రిజిష్టర్‌లో ఉంది. ఇతర వివరాలు లేకపోవడంతో మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు ఆస్పత్రిలోని ఔట్‌పోస్టులో సంప్రదించాలని మార్చురీ ఇన్‌ఛార్జి తేజా తెలిపారు.

మహిళల ముఖాల్లో చిరునవ్వు చూస్తున్నాం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ప్రొద్దుటూరు : డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



కలసపాడు: డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రొద్దుటూరు క్రైం : డ్వాక్రా రుణాలను పూర్తిగా చెల్లించి మహిళల ముఖాల్లో చిరునవ్వును చూస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జిన్నారోడ్డులో శుక్రవారం నిర్వహించిన 4వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని 2149 స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా 4వ విడత కింద ప్రభుత్వం రూ. 19,39,30,500 అందచేసిందన్నారు. నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలను పూర్తిగా చెల్లించి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు మాట తప్పి మహిళలను మోసం చేశారన్నారు. నాడు మోసం చేసిన బాబు ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తానని కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎలాగైనా అధికారంలోకి రావడానికి బాబు ఎంతటి అబద్ధాలు చెప్పడానికైనా వెనకాడడని, అక్కచెల్లెమ్మలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికి మేలు జరిగి ఉంటేనే తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అంది ఉంటేనే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ప్రొద్దుటూరులో అనేక అభివృద్ధి పనులను చేశామన్నారు. కొత్తగా కూరగాయల మార్కెట్ నిర్మాణం, రామేశ్వరం బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండు, కాలువల ఆధునీకరణ, కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు, మున్సిపల్ పార్కు అభివృద్ధి తదితర ఎన్నో పనులను చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. టీడీపీ నాయకుల ప్రలోభాలకు, అబద్ధాలను నమ్మితే పేదల జీవితాలు మరింత పేదరికంలోకి వెళ్తాయన్నారు. అనంతరం మహిళలకు మెగా చెక్‌ను ఎమ్మెల్యే రాచమల్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చింతకుంట సరితారెడ్డి, నూక నాగేంద్రారెడ్డి, జిలాన్ బాషా, 19వ వార్డు ఇన్‌చార్జి చాంద్‌బాషా, టౌన్ బ్యాంక్ చైర్మన్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

కలసపాడు : మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తే ఆ కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కలసపాడులోని ఎంఈఓ కార్యాలయం సమీపంలోని క్రీడామైదానంలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. మండలంలో 596 గ్రూపులకు రూ.4.17 కోట్లు మెగా చెక్కును ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల చేతులమీదుగా డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో గెలవాలనే దురాశతో చంద్రబాబు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని, ఎవరూ బ్యాంకులలో డబ్బులు కట్టవద్దని ప్రకటించారని, చంద్రబాబు మాటలను నమ్మిన మహిళలు రుణాలు కట్టక పోగా వడ్డీలు పెరిగి ఖాతాలు బ్లాక్‌లో పడ్డాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక డ్వాక్రా మహిళలకు మొండిచేయి చూపి మళ్లీ ఎన్నికల కోసం పసుపు, కుంకుమ డ్రామాకు తెరతీశారన్నారు. చంద్రబాబు నైజాన్ని పసిగట్టిన మహిళలు 2019 ఎన్నికల్లో బుద్ధిచెప్పారని తెలిపారు. జగనన్న సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలు తెలుసుకుని ముఖ్యమంత్రి కాగానే నాలుగు విడతల్లో ఆర్థిక సాయం చేసేలా వైఎస్సార్ ఆసరా ద్వారా వారిని ఆదుకుంటున్నారన్నారు. మహిళలంతా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆదరించి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, బద్వేలు వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ బి.వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారా మక్కృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తం రెడ్డి, స్థానిక సర్పంచ్ శివలీల, ఎంపీటీసీ కుర్షీద్‌బేగం, పులివీరారెడ్డి, వావిళ్ళగురయ్య, సింగరయ్య, వెలుగు ఏపీఎం సుబ్బరాయుడు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలి



వార్డులో మున్సిపల్ అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. క్లీన్‌అండ్‌గ్రీన్ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం 9వ వార్డులోని ఆంజనేయనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డులోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని, చెత్తవ్యర్థాలు లేకుండా చూడాలని కోరారు. ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని కోరారు. పట్టణ సుందరీకరణకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డీఈ సుమన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి గుబ్బా వెంకటసుబ్బయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

జాగ్రత్తగా డ్రైవింగ్ చేయండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు వెంకట చెంచయ్య, అనూష వల్లం కొండు

ప్రొద్దుటూరు క్రైం : డ్రైవింగ్ చేసేటప్పుడు ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ అతి వేగంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఎంవీఐ నారాయణనాయక్, ట్రాఫిక్ సీఐ యుగంధర్ రహదారి భద్రతపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు..

ధ్రితి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వెంకటచెంచయ్య, డాక్టర్ అనూష వల్లంకొండు వైద్య సేవలు అందచేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దని వైద్యులు తెలిపారు. చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని చెప్పారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న డాక్టర్లు, అధికారులు

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్ బాబు, హేమలత పేర్కొన్నారు. శుక్రవారం దువ్వూరు జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, సర్పంచ్ చెంద్రాయుడు ప్రారంభించారు. వైద్య శిబిరానికి హాజరైన 412 మంది రోగులకు షుగర్, బీపీ, థైరాయిడ్, కంటి వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను డాక్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలత, నాగయ్య, చంద్రమౌళి, మండల పరిషత్ ఏఓ నాగేంద్రబాబు, హెల్త్ సూపర్‌వైజర్ రాజగోపాల్, విజయకుమారి, శాంతకుమారి, సువర్ణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మోడల్ టెస్టును విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 6న స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు నిర్వహిస్తున్న మోడల్ టెస్టును విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవిలు తెలిపారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం మోడల్ టెస్టుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించేందుకు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మోడల్ టెస్టు నిర్వహిస్తున్నామని, ప్రముఖ విద్యావేత్త కె.ఎస్.లక్ష్మణరావు నేతృత్వంలో తయారుచేసిన ప్రశ్నాపత్రంతో పరీక్ష నిర్వహిస్తారన్నారు. 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, చిన్ని, పట్టణ నాయకులు సిద్దయ్య, సుహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

బాధ్యతలు చేపట్టిన ప్రొద్దుటూరు డీఎస్పీ దాసరి మురళీధర్



ప్రొద్దుటూరు క్రైం : రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని డీఎస్పీ దాసరి మురళీధర్ తెలిపారు. ప్రొద్దుటూరు డీఎస్పీగా ఆయన శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో రెడ్‌శాండల్ టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తూ బదిలీపై ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రేరణాకుమార్ బీహార్ క్యాడర్‌కు బదిలీ అయ్యారు. 1991 బ్యాచ్‌కు చెందిన మురళీధర్ స్వస్థలం అనంతపురం జిల్లాలోని గుంతకల్. ఆయన ఎక్కువ కాలం కర్నూల్ జిల్లాలో పని చేశారు. అలాగే చిత్తూరు జిల్లాలోని తిరుపతి, పుత్తూరులలో విధులు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో సీబీసీఐడీ విభాగంలో పని చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. రౌడీయిజాన్ని సహించేది లేదని తెలిపారు. ప్రొద్దుటూరులో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

చెరువులు, కుంటలను కాపాడుకోవాలి



చిత్తడి నేలలపై అవగాహన ర్యాలీలో విద్యార్థులు

మైదుకూరు : మన పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలను కాపాడుకోవాలని అటవీ అధికారులు పేర్కొన్నారు. మండలంలోని జీవీ సత్రంలో శుక్రవారం చిత్తడి నేలల దినోత్సవాన్ని అటవీ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు చిత్తడి నేలలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ బీట్ అధికారులు జాకీర్, ఎం.లింగా నాయక్ మాట్లాడుతూ చెరువులు, కుంటలను సంరక్షించుకోవడం వల్ల వన్యప్రాణాలను, పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏబీఓ సురేష్, పాఠశాల హెడ్మాస్టర్ ప్రసాద్, పీఈటీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

ఖాజీపేట : రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తప్పని సరిగా బిల్లులు తీసుకుని కొనుగోలు చేయాలని ఏడీఏ నాగరాజు రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన ఖాజీపేటలోని పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, పురుగుల మందులును పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లో తప్పని సరిగా నోటీస్ బోర్డు , ధరల పట్టిక ఉండాలని సూచించారు. అలాగే రావులపల్లె, చెన్నముక్కపల్లె రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. అక్కడ రైతులకు అందే సేవల గురించి ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది రైతులను సమన్వయ పరచుకుంటూ వారికి తగిన సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగార్జున, తోపాటు స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్య శ్రీ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీ పథకం లేక గుండె జబ్బులు, ఇతర జబ్బులు వచ్చి ఎంతో మంది పేదలు చనిపోయారన్నారు. ప్రజాప్రస్థానంలో భాగంగా వైఎస్ఆర్ పాదయాత్ర చేసినప్పుడు సమస్యను గుర్తించి ఆరోగ్యశ్రీ పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎంతో మంది ప్రాణాలకు ఆయన ఊపిరి పోశారన్నారు. ఆ తర్వాత పనిచేసిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ఆరోగ్యశ్రీ పథకాన్ని పట్టించుకోలేదన్నారు. కాలానికి అనుగుణంగా మార్పులు చేయలేదని తెలిపారు. తండ్రికి మించిన తనయుడుగా పేరు తెచ్చుకున్న జగన్ 1050 జబ్బులు ఉన్న ఆరోగ్యశ్రీలో 3550 జబ్బులను చేర్చారన్నారు. గతంలో ఏడాదికి రూ.5లక్షలు మాత్రమే ఆరోగ్యశ్రీ కార్డు విలువ ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని సూచించారు. ఇంతకాలం నియోజకవర్గ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని, తన హయాంలో పట్టణ రూపురేఖలను మార్చుతున్నానన్నారు. కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, పార్కు, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వత భవనాలు, మున్సిపాలిటీని అందంగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు పందిటి సరోజమ్మ, వరికూటి ఓబుళరెడ్డి, డాక్టర్ శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

ప్రొద్దుటూరు క్రైం : మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో ఉన్న గురవయ్యతోటలో రూ. 11 లక్షలతో ఏర్పాటు చేయనున్న సిమెంట్ రోడ్డుకు శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై టీడీపీ నాయకులు మాట్లాడరా..?

ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధిపై టీడీపీ నాయకులు ఏనాడూ మాట్లాడరని, తనను వ్యక్తిగతంగా విమర్శించి లబ్ధి పొందాలని చూస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందడంతో పాటు తాను ఎప్పుడూ వారికి అందుబాటులో ఉంటున్నానన్నారు. ప్రజల అవసరాలు, అభివృద్ధికి సంబంధించి ఏనాడూ టీడీపీ నాయకులు ఆందోళనగానీ, ధర్నాలు చేయలేదన్నారు. 25 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న వరదరాజుల రెడ్డి హయాంలో ప్రొద్దుటూరు అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే వరద పట్టణంలో తిరిగితే ఆయన గుర్తు పట్టలేనంతగా అభివృద్ధి జరిగిందన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని త్రిపురవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, ముత్తులూరు పాడు పంచాయతీలోని శాంతినగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను, కూనవారిపల్లె పంచాయితీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ఇబ్బందులు ఉన్నా ప్రజల సంక్షేమాన్ని సీఎం మరువలేదన్నారు. ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడంతోపాటు పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో చిన్న పనికావాలన్నా మండల కేంద్రానికి వెళ్లి ఇబ్బందులు పడేవారన్నారు. నేడు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా అన్ని రకాల సేవలు వెంటనే అందుతున్నాయన్నారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి.. నేడు మీకు అందుతున్న సంక్షేమ ఫలాలను గమనించాలన్నారు. ప్రజల సంక్షేమం కోరే సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలబడి అందరం గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, త్రిపురవరం సర్పంచ్ సుస్మిత, ఎంపీటీసీ పార్వతమ్మ, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రాముడు, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

మైదుకూరు : కర్నూలు జిల్లాకు బదిలీ అయిన మైదుకూరు ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డికి శుక్రవారం మండల పరిషత్ అధికారులు వీడ్కోలు పలికారు. మండల పరిషత్ ఏఓ లక్ష్మీదేవి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సుధాకర్, అధికారులు రాజన్న, సునీల్‌కుమార్, వీరవరప్రసాద్, ఉపాధి ఏపీఓ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది ఎంపీడీఓను శాలువా, పూలమాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. కొద్ది రోజుల కిందట ఎంపీడీఓ రమణారెడ్డి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు.

బాధ్యతల స్వీకరణ

బ్రహ్మంగారిమఠం : సాధారణ ఎన్నికల్లో భాగంగా బి.మఠం ఎంపీడీఓగా చిత్తూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన శివమల్లేశ్వరప్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బి.మఠంలో పనిచేస్తున్న వెంకమునిరెడ్డి చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. శివమల్లేశ్వరప్ప మాట్లాడుతూ బి.మఠం అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

చాపాడు ఎంపీడీఓగా పి.మహబూబ్‌బీ

చాపాడు : మండల అభివృద్ధి అధికారిగా పాత కడప మహబూబ్‌బీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీఓలను బదిలీ చేశారు. ఈ క్రమంలో చాపాడు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కలసపాడు మండల ఎంపీడీఓ మహబూబ్‌బీని ఇక్కడికి బదిలీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తనవంతు చర్యలు తీసుకుంటానన్నారు. రానున్న వేసవిలో మంచినీటి సమస్య లేకుండా అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాశినాయన ఎంపీడీఓగా మధు

కాశినాయన : మండల ఎంపీడీఓగా బి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నంద్యాల జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈయన గత ఉపఎన్నికల్లో మూడు నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై దృష్టి సారించి ప్రజావసరాలను తీర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

తహసీల్దారుకు సన్మానం



నరసాపురంలో తహసీల్దారు రామచంద్రుడును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కాశినాయన : మండల తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై నంద్యాల జిల్లాకు వెళుతున్న తహసీల్దారు రామచంద్రుడును శుక్రవారం డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నలక్ష్మి, సర్వే డిప్యూటీ తహసీల్దారు సత్యమూర్తి, మండల రెవెన్యూ అధికారి దక్షిణమూర్తి, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, గ్రామ సహాయకులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

దువ్వూరు : మండలంలోని కృష్ణంపల్లె గ్రామానికి చెందిన వేమిరెడ్డి ఓబుళరెడ్డిని మైదుకూరు నియోజకవర్గ జేసీఎస్ గ్రూప్ కన్వీనర్‌గా నియమించారు. ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు.

విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని బాలికల ఉన్నతపాఠశాల, గురుకుల పాఠశాల విద్యార్థులు 750 మందికి శుక్రవారం పోరుమామిళ్ళలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి చిత్తా దంపతుల సూచన మేరకు సంస్థ నిర్వాకులు ఎల్ .ప్రసాద్‌రెడ్డి ఉచితంగా దుస్తులు అందించారు. ఈసందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద విద్యార్థులు చదువులో రాణించాలంటే ఇలాంటి ప్రోత్సాహకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థిని నితీషా రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలోని యూత్ క్రికెట్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థిని గురజాల నితీషా రెడ్డి జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల ప్రకాశం జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–17 బాలికల క్రికెట్ పోటీలో ప్రతిభకనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో పాల్గొననున్నట్లు వైఎస్ఆర్‌సీపీ నాయకుడు మార్తల సుధాకర్‌రెడ్డి తెలిపారు.